క్లుప్తంగా

కృష్ణా కళాశాలలో జాబ్ మేళా

• 56 మంది ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 56 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు తెలిపారు. కళాశాలలో దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ నిర్వహించిన జాబ్ డ్రైవ్‌కు సుమారు రెండు వందల మంది హాజరు కాగా, వారిలో 56 మందిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన వారికి మే నెలలో మెడికల్ పరీక్ష నిర్వహించిన అనంతరం అపాయింట్‌మెంట్ లెటర్లు ఇస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి జాబ్ మేళాల్లో అవకాశాలను అందిపుచ్చుకుని మెరుగైన ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ జి.రాజ్ కుమార్, సీనియర్ కెమిస్ట్రీ అధ్యాపకురాలు డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 12 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సోమవారం 12 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. ఈ కేంద్రంలో జనరల్ విద్యార్థులు 232 మందికి గాను 3 గైర్హాజరు కావడంతో 229 మంది పరీక్ష రాశారని తెలిపారు. ఒకేషనల్ కోర్సుల పరీక్షలకు 291మందికి 9 మంది గైర్హాజరు కాగా 282 మంది పరీక్ష రాశారన్నారు. పరీక్ష కేంద్రానికి 523 మందిని అలాట్ చేశారని, వీరిలో 511 మంది పరీక్ష రాయగా, 12 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

జోన్–3 పీజీఆర్ఎస్‌కు రెండు వినతులు



పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న జోన్–3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు రెండు వినతులు వచ్చాయి. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ రెండు అర్జీలూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించినవే అని జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏపీఈఏ వైస్ చైర్మన్‌గా పరమేశ్వరరావు



ఎంవీపీకాలనీ: ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ (ఏపీఈఏ) వైస్ చైర్మన్‌గా ఆచార్య కె.పరమేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం విశ్రాంత ఆచార్యుడైన ఆయనకు విజయవాడలోని సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇటీవల జరిగిన అసోసియేషన్ 41వ వార్షిక సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ఆయన సోమవారం తెలిపారు. ఆచార్య పరమేశ్వరరావు గతంలో ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ (ఐఈఏ)కు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఏయూ ఆచార్యులు, విద్యావేత్తలు అభినందనలు తెలిపారు.

పోలీస్ బ్యాండ్ గదుల ప్రారంభం



పోలీస్ బ్యాండ్ గదులను ప్రారంభించిన సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్ బ్యాండ్ కోసం పోలీస్ బ్యారెక్స్‌లో నూతనంగా నిర్మించిన గదులను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ప్రారంభించారు. పోలీస్ కార్యక్రమాలు, పలు జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు బ్యాండును అందించేందుకు 19 మంది సభ్యులతో పోలీస్ బ్యాండ్ ఉంది. సీపీ గతంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పర్యటనలో నగర పోలీసు బ్యాండు గది శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అదే ప్రాంగణంలో నూతన గదులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే గదులను నూతనంగా నిర్మించారు. బ్యాండ్ ప్రాక్టీస్ కోసం ఒక గదిని, వారు ఉండేందుకు మరో ఏసీ గదిని సీపీ ప్రారంభించారు.

పేరుకే పార్కు



అధ్వానంగా పార్క్ పరిసరాలు



మూలకు చేరిన ఓపెన్ జిమ్ పరికరాలు

మచ్చుకైనా కానరాని పచ్చదనం

కనిపించని ఆటవస్తువులు

మూలకు చేరిన ఓపెన్ జిమ్ పరికరాలు

దెబ్బతిన్న నడక మార్గాలు



పచ్చదనం లేక మైదానాన్ని తలపిస్తున్న పార్క్ పరిసరాలు



పార్క్ ప్రవేశం వద్ద రాతి స్వాగతద్వారం



రాతి శిల్పం చుట్టూ ఎండిపోతున్న మొక్కలు

ఏయూక్యాంపస్: పార్క్ అనగానే ఆహ్లాదకర వరిసరాలు, ఆకుపచ్చని మొక్కలు, పిల్లలు ఆడుకునేందుకు అనువైన ఆట వస్తువులు, ఉదయాన్నే వ్యాయామం చేయడానికి ఓపెన్ జిమ్‌లు గుర్తు వస్తాయి. కానీ బీచ్‌రోడ్డులో సీ పెరల్ పార్లర్ పక్కనున్న పార్కులో పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటాయి. సాయంత్రం వేళల్లో కాస్త సేదతీరుదామని వెళ్లేవారికి నిరాశే ఎదురవుతోంది.

పచ్చదనం కనుమరుగు

పార్క్‌లో మచ్చుకైనా పచ్చదనం కనిపించడం లేదు. పార్క్ మధ్యలో రాతితో చేసిన శిల్పాలను ప్రత్యేకంగా అలంకరించారు. వీటి చుట్టూ మొక్కలను నాటారు. ప్రస్తుతం ఇవి పూర్తిగా ఎండిపోయే పరిస్థితిలో ఉన్నాయి. పార్క్ పరిసరాలలో కూడా పచ్చదనం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. అక్కడక్కడ కొన్ని మొక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి. పార్క్‌లో లాన్‌లో వేసిన గడ్డి పూర్తిగా ఎండిపోయింది. అదే విధంగా పార్క్‌లో ఎలుకలు భారీగా గుంతలు తవ్వేస్తున్నాయి. ఈ కారణంగా పార్క్ పరిసరాలు తమ స్వరూపాన్ని పూర్తిగా కోల్పోతున్నాయి.

ఆట వస్తువులేవీ?

పార్కుకు పిల్లలతో కలిసి వచ్చే కుటుంబాలకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది. పార్క్‌లో గతంలో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు పూర్తిగా శిథిలమయ్యాయి. వీటిని పునరుద్ధరించడం, కొత్తవి ఏర్పాటు చేయడం జరగడం లేదు. దీంతో చిన్నారులు ఆడుకోవడానికి కనీసం ఒక్క ఆట వస్తువు కూడా ఇక్కడ కనిపించడం లేదు.

మూలకు చేరిన ఓపెన్ జిమ్

పార్క్‌లో నగరవాసులు ఉదయం వేళలలో వ్యాయామం చేయడానికి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పూర్తిగా మూలకు చేరింది. దీనికి సంబంధించిన పరికరాలు కొన్ని తుప్పు పట్టాయి. మరికొన్ని విరిగిపోయి నిరుపయోగంగా మారాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తే పార్కుకు వచ్చేవారికి, ఆరోగ్యప్రియులకు ఉపయుక్తంగా నిలుస్తాయి.

నడకదారి శిథిలం



గోతులు పడ్డ నడక మార్గం

పార్క్‌లో నడకకు వీలుగా నిర్మించిన రహదారులు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల రహదారిపై వేసిన పలకలు పాడైపోయాయి. దీంతో గోతులు పడిపోయాయి. నడకకు ఏ మాత్రం అనువుగా లేవు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపు



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణాను వినియోగించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాపై ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు రవాణా వ్యవస్థను, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని, అందుకు అందరూ సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.

బీఎడ్ మూల్యాంకన కేంద్రం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలోని బీఎడ్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనం జరుగుతున్న కేంద్రాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు సోమవారం పరిశీలించారు. యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలో 57 కళాశాలలకు సంబంధించిన బీఎడ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఏయూలో జరుగుతోంది. ఈ సందర్భంగా మూల్యాంకనాన్ని పరిశీలించిన ఆయన విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజుతో మాట్లాడి, పలు విషయాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజకుమారి ఉన్నారు.

దారపాలెంలో ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు



రూరల్ తహసీల్దారు పాల్‌కిరణ్



కార్యాలయం ఆవరణలో సిద్ధం చేసిన కొత్త హెచ్చరిక బోర్డులు

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి పైనాపిల్‌కాలనీ దరి దారపాలెంలో ప్రభుత్వ భూముల రక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ ప్రాంతంలో భూకబ్జాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. దీంతో ఇక్కడ ప్రభుత్వ భూములపై రూరల్ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా స్థలాల్లో ఏర్పాటు చేయడానికి కొత్త హెచ్చరిక బోర్డులు సిద్ధం చేశారు.

కలెక్టర్‌కు నివేదిక

దారపాలెంలో ఇటీవల ప్రభుత్వ భూమి సర్వే చేసినట్లు రూరల్ తహసీల్దారు పాల్‌కిరణ్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ 15/12 సర్వే నంబర్‌లో 3.07 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలిపారు. దానిలో కొంతభాగం ఆక్రమించి ఇప్పటికే కొన్ని నివాసాలు వెలిశాయన్నారు. మరికొంత ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇటీవల కొందరు ఆక్రమణకు సిద్ధమైనట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు నివేదిక అందించామని, ఆయన ఆదేశాలు ఇచ్చిన వెంటనే 15/12లో ఆక్రమణకు గురైన స్థలంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం ఈ సర్వే నంబర్‌లో కొంతమంది స్థలం ఆక్రమించి, ఐదు ప్లాట్లుగా చేసి చేపట్టిన నిర్మాణ పనులను అడ్డుకున్నామన్నారు. దీనిపై కూడా కలెక్టర్‌కు నివేదిక పంపించామన్నారు. ప్రభుత్వ స్థలాలు ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

కేంద్ర మంత్రికి వినతి



మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: దేశంలో 75 కోట్లకు పైగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. దీనిపై న్యూఢిల్లీలో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను సోమవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. జనాభా దామాషా ప్రకారం బీసీ సామాజిక వర్గానికి విద్య, ఉద్యోగ, పారిశ్రామిక రంగాలలో అవకాశాలు, కేటాయింపులు చేయాలని కోరారు. కేంద్రంలో ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కేంద్రబడ్జెట్‌లో బీసీ సామాజిక వర్గానికి కేటాయింపులు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దాదాపు 20 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

డాబాగార్డెన్స్: ఆంధ్రా యూనివర్శిటీ డిగ్రీ తృతీయ సంవత్సరం ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల (రామ్‌నగర్) విద్యార్థినులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షాహిద్ అలీ తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ తృతీయ సంవత్సరం ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థినులు 98.83 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ప్రతిభ సాధించిన విద్యార్థినులను కళాశాల నార్త్ ఆంధ్ర రీజియన్ డైరెక్టర్ పి.రామకృష్ణారెడ్డి, నోడల్ అకడమిక్ అధికారి ఎస్.వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. హిమశేఖర్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి చంద్రశేఖర్ పలువురు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఏయూ విద్యార్థికి పురస్కారం

• పరిశోధన పత్రాల్లో కేతన్ ప్రాజెక్ట్‌కు ప్రథమస్థానం

• ఐఈఈఈ సదస్సులో బహూకరణ



కేతన్‌రెడ్డిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విభాగానికి చెందిన బీటెక్ రెండో సంవత్సర విద్యార్థి ఆళ్ల కేతన్ రెడ్డి అరుదైన ఘనత సాధించారు. డీఆర్‌డీవో (ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్, బాలాసోర్, ఒరిస్సా) ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సులో ఉత్తమ పరిశోధనా పత్ర పురస్కారాన్ని అందుకున్నాడు. ఎలక్ట్రానిక్ ఆడియో తరంగాలలో ఉన్న అనవసర శబ్దాలను తొలగించడానికి డినాయిసింగ్ సాంకేతికతను తయారుచేసిన కేతన్ రెడ్డి ప్రాజెక్ట్ మొదటి స్థానం పొందడంతో ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు కేతన్‌రెడ్డిని సోమవారం అభినందించారు. ప్రతిష్టాత్మక వర్సిటీల నుంచి వచ్చిన వంద పరిశోధనా పత్రాల్లో ఏయూ విద్యార్థి పరిశోధన ప్రథమ స్థానంలో నిలవడం, డీఆర్‌డీవో సదస్సులో పురస్కారం అందుకోవడం గర్వకారణమని ప్రశంసించారు.

రూ.4వేలు పెన్షన్ వర్తింపజేయాలి



జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్న పింఛన్ మాదిరిగానే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రూ.4 వేలు పెన్షన్‌ను ఇవ్వాలని ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఏవీ రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వీవీకే రాయ్, ఉపాధ్యక్షులు సీహెచ్. పైడిరాజు రెడ్డి, జగతరావు డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ రీజియన్ నేతృత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మీడియాతో మాట్లాడుతూ కొందరు ఉద్యోగులకు ఇప్పటికీ కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరు చేయలేదన్నారు. పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించినప్పటికీ స్పందన లేదన్నారు. కనీసం వృద్ధులకు ఇస్తున్న రూ.4వేలు పెన్షన్ అయినా వర్తింపజేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి ఈ నెల 14న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టి ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేయనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, కోశాధికారి జగ్గారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీనరసింహం, రీజినల్ కార్యదర్శి వెంకట్రావు, జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాచార భద్రత ఎంతో కీలకం

• సైబర్ చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

• ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్



వర్చువల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య రాజశేఖర్

విశాఖ విద్య: సైబర్ చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఏయూ న్యాయ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న వారం రోజుల ఫ్యాకల్టీ అఫ్టేషన్ ప్రోగ్రాం (ఎఫ్‌యూపీ)ను సోమవారం ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ సమాచార గోప్యత అనేది ఎంతో కీలకమని చెప్పారు. సాంకేతిక, న్యాయ నిపుణులు సమష్టిగా పనిచేస్తూ సైబర్ భద్రతను పెంపొందించే విధంగా కృషి జరగాలని సూచించారు. భారతదేశంలో ప్రతి నిమిషం వందలాది సైబర్ దాడులు చోటు చేసుకుంటున్నాయని, ఇది సమస్య తీవ్రతకు అద్దం పడుతోందని చెప్పారు. విద్యావంతుల్లో సైతం సైబర్ చట్టాలపై అవగాహన కొరవడిందన్నారు. న్యాయ విద్యార్థులు ముఖ్య భూమిక పోషిస్తూ ప్రజలను ఈ దిశగా చైతన్యవంతం చేయాలని సూచించారు. సమ్మిళిత ఆలోచనలతో పని చేస్తూ సమర్థవంతమైన పరిష్కారాలను అందించాల్సిన అవసరాన్ని వివరించారు.

వారం రోజుల శిక్షణ

కార్యక్రమ సమన్వయకర్త, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన సైబర్ చట్టాలు, సైబర్ రక్షణ, సమాచార భద్రత అంశంపై వారం రోజులపాటు అధ్యాపకులకు జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (ఐఎస్ఈఏ) ప్రాజెక్ట్–3 చీఫ్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య వి. వల్లి కుమారి మాట్లాడుతూ సెక్యూరిటీ, ప్రైవసీ రంగాలలో తాము పని చేస్తున్నామని చెప్పారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, సైబర్ టెర్రరిజం అనేది ప్రపంచ దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని చెప్పారు. పరిశోధన ఆవిష్కరణల దిశగా తాము పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 17 రాష్ట్రాల నుంచి 118 మంది పాల్గొంటున్నారని తెలియజేశారు.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు



షాపు యజమానికి అవగాహన కల్పిస్తున్న శానిటరీ సిబ్బంది

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో సోమవారం పలు షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వాడడాన్ని నిషేధించాలని, వాటివల్ల కలిగే దుష్ప్రయోజనాలు వివరిస్తూ శానిటరీ సిబ్బంది అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వినియోగదారులు గుడ్డ సంచులను వారితో పాటు తప్పక తెచ్చుకోవాలని సూచించారు. దుకాణ యజమానులు, తోపుడు బళ్ల వ్యాపారులు ఎవరైనా ప్లాస్టిక్ వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్, సెక్రటరీలు, సూపర్‌వైజర్లు చిరంజీవి, గణేష్ పాల్గొన్నారు.

మూగజీవుల దాహార్తిని తీర్చేలా..



వేసవి సమీపిస్తోంది. అందరికీ దాహార్తి పెరిగిపోతుంది. ఎక్కడా చుక్క నీరు దొరకని పరిస్థితి ఎదురవుతుంది. ఇటువంటి సమయంలో పక్షులు, మూగ జీవాలకు అవసరమైన నీరు దొరకడం కష్టమవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని నగరంలో మూగ జీవాలకు వేసవిలో అవసరమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో సహకారంతో ప్రత్యేకంగా నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల్లో వీటిపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మద్దిలపాలెంలోని ఓ పాఠశాలలో సోమవారం వీటిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ నీలిమ, ఉపాధ్యాయిని సుధారాణి, సునీత, గ్రీన్ క్లైమేట్ వలంటీర్లు జె.రాజేశ్వరి, ఐ.కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు. – మద్దిలపాలెం

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సావిత్రీబాయి పూలే ఆశయసాధనకు కృషి



సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆచార్య షారోన్ రాజు

విశాఖ విద్య: సావిత్రీ బాయి పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు కోరారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా విభాగంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య షారోన్ రాజు మాట్లాడుతూ భారతదేశంలో మహిళల విద్య, సమాజసేవ మరియు సమానత్వ ఉద్యమాలకు సావిత్రీబాయి పూలే మార్గదర్శకురాలిగా నిలిచారన్నారు. నేటి యువత సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.